క్లుప్తంగా

నేడు గోపాల్‌నగర్‌లో ఎమ్మెల్యే బాలినేని 'గడపగడపకు'

ఒంగోలు సబర్బన్: నగరంలోని 5వ డివిజన్ గోపాల్‌నగర్ ఒకటో సచివాలయం పరిధిలో శనివారం ఉదయం 8 గంటలకు ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు బాలినేని కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. భరత్‌సింగ్‌కాలనీ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, 5వ డివిజన్ కార్పొరేటర్ ఎండేటి పద్మావతి రంగారావుతో కలిసి బాలినేని నిర్వహిస్తారని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు, మహిళా నాయకులు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, అభిమానులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బ్రాహ్మణులపై దాడులు ఆపాలి

ఒంగోలు మెట్రో: బ్రాహ్మణులపై దాడిచేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకుని దాడులు ఆపాలని ప్రకాశం జిల్లా బ్రాహ్మణ ఐక్యవేదిక డిమాండ్ చేసింది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సోమేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకునిపై దేవస్థాన చైర్మన్ భర్త యుగంధర్ దాడిచేయడంపై ఐక్యవేదిక నాయకులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక లాయర్‌పేటలోని రైతు బజార్ వద్ద టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బ్రాహ్మణులపై దాడులు ఆపాలని నినాదాలు చేస్తూ కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని కార్యాలయ పరిపాలనాధికారి చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వేద పురోహితులు వ్యామజాల ప్రసన్నకుమార్‌శర్మ, నేలబొట్ల సుబ్రహ్మణ్య శర్మ, గోపాలశర్మ, జంగా కృష్ణమూర్తిశర్మ, సుజాత, బ్రాహ్మణులు పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రత ప్రధానం

- శానిటేషన్ సిబ్బందితో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: నగరాన్ని పరిశుభ్రంగా ఉంచి పచ్చదనంతో నింపాలని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత శానిటేషన్ సిబ్బందికి సూచించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్యాన్ని మెరుగుపరచాలన్నారు. ప్లాస్టిక్ రహితంగా కూడా మార్చాలని పిలుపునిచ్చారు. నగరంలో కుక్కల వల్ల ప్రజలు ఇబ్బందిపడకుండా వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించాలన్నారు. ఆవులు రోడ్లమీద ఉండటం వల్ల ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని, యజమానులకు చెప్పి తరలించాలని సూచించారు. లేకుంటే బందీల దొడ్లకు తరలించాలన్నారు. వర్షాకాలం కావడంతో ప్రజలు దోమల వల్ల ఇబ్బంది పడకుండా నెలలో రెండుసార్లు యాంటీ లార్వా ఫాగింగ్ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, శానిటేషన్ సూపర్‌వైజర్ ఎస్ఎస్ పిచ్చయ్య, నూతన స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దేశ సంస్కృతిని చాటిచెప్పాలి



కొత్తపట్నం : జెండా ఆవిష్కరిస్తున్న అధికారులు



కేవీ పాలెంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ, తహసీల్దార్, ఎంపీడీఓ, తదితరులు

కొత్తపట్నం: మన దేశం ఎంతో గొప్పదని, దేశ సంస్కృతిని అందరికీ తెలియజెప్పాలని మండల ప్రత్యేక అధికారి, డీజేబులిటీ ఏడీ జి.అర్చన పిలుపునిచ్చారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న నా భూమి–నా దేశం, నేలమ్మకు నమస్కారం–వీరులకు వందనం ఆజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమాలను శుక్రవారం ఘనంగా జరిపారు. అల్లూరు, గమళ్లపాలెం, కె.పల్లెపాలెం, రంగాయపాలెం, మోటుమాల, గుండమాల పంచాయతీల్లో శిలాఫలకాన్ని దేశానికి అంకితం చేయడం, పంచప్రాణ ప్రతిజ్ఞ, వసుధకు వందనం, వీరులకు వందనం, జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. అమృత్ వాటికలో భాగంగా మొక్కలు నాటారు. ఏపీవో రత్నజ్యోత్స్న, సర్పంచ్ కారాని జయరావు, విశనాథపల్లి ఆనంద్‌రావు, నంబూరి సూర్యనారాయణ, కోడూరి గోపి, గాలి స్వరూప, కార్యదర్శులు కె.వెంకటేశ్వరరెడ్డి, ఐపీ రామారావు, వంశీ, లావణ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేవీ పాలెంలో...

చీమకుర్తి: మండలంలోని కేవీ పాలెంలో శుక్రవారం నిర్వహించిన నా భూమి–నాదేశం కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మధుసూదన్‌రావు, ఎంపీడీవో రాఘవేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

శిద్దాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బాలినేని



శిద్దా రాఘవరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావుకు స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఉదయం ఒంగోలు వచ్చిన బాలినేని.. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, నగర నాయకుడు కటారి శంకర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్‌తో కలిసి శిద్దా ఇంటికి చేరుకుని శాలువా కప్పి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాలినేనిని దుశ్శాలువాతో శిద్దా రాఘవరావు సత్కరించారు.

కార్పొరేటర్ గోలి లక్ష్మికి ఎమ్మెల్యే బాలినేని పరామర్శ



కార్పొరేటర్ గోలి లక్ష్మీకోటేశ్వరమ్మను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: నగరపాలక సంస్థ 39వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ గోలి లక్ష్మీకోటేశ్వరమ్మను ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరామర్శించారు. లక్ష్మీకోటేశ్వరమ్మ కాలికి చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటోంది. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలినేని.. ఆమె నివాసానికి వెళ్లి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. శుక్రవారం లక్ష్మీకోటేశ్వరమ్మ పుట్టినరోజును పురస్కరించుకుని ఆమెతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, లక్ష్మీకోటేశ్వరమ్మ భర్త గోలి తిరుపతిరావు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాదు, మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్ సీపీ నాయకుడు కటారి శంకర్, కార్పొరేటర్లు బేతంశెట్టి శైలజ హరిబాబు, కో ఆప్షన్ మెంబర్ సర్తాజ్, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు జేవీవీ సెమినార్

ఒంగోలు: మన రాజ్యాంగం–ఒక అవగాహన అనే అంశంపై శనివారం సెమినార్ నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కర్నూలు రోడ్డులోని ది ఒంగోలు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ హాలులో సాయంత్రం 4 గంటలకు సెమినార్ ప్రారంభమవుతుందన్నారు. వక్తలుగా డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు హాజరవుతారని చెప్పారు.

గద్దర్ మరణం పీడిత ప్రజలకు నష్టం

చీమకుర్తి: ప్రజాయుద్ధ నౌకగా పేరుగాంచిన గద్దర్ మరణం పీడిత కులాల ప్రజలకు తీరని నష్టమని కేవీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దుడ్డు వెంకట్రావు అన్నారు. శుక్రవారం పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో గద్దర్ సంతాప సభ నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుడ్డు వెంకట్రావు మాట్లాడుతూ రైతు, కార్మిక, విద్యార్థి, దళిత మహిళల సమస్యల పరిష్కారం కోసం గత 50 సంవత్సరాలుగా సాంస్కృతిక ఉద్యమాల ద్వారా గద్దర్ పోరాటం సాగించారన్నారు. నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన గద్దర్.. బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తూనే పీడిత కులాల పక్షాన పోరాటం చేశారన్నారు. గద్దర్ లేని లోటు భర్తీ చేయలేనిదన్నారు. కార్యక్రమంలో ప్రజాకళామండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే కోటి, సంగా భాను, పిన్నిక శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ కొత్రపు రాఘవ, పూసపాటి వెంకట్రావు, చలువాది రమేష్, షేక్ ఖాదర్‌బాషా, పేరం శ్రీనివాసరావు, మర్రి లక్ష్మీనారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

జవాన్ల త్యాగాలు మరువలేనివి



మట్టిగుంటలో రిటైర్డు జవాన్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ దంపతులు, ఎంపీడీవో

నాగులుప్పలపాడు: దేశాన్ని కాపాడటంలో జవాన్ల పాత్ర మరువలేనిదని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని డ్వామా ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న నేల తల్లికి నమస్కారం–వీరులకు వందనం, వసుధకు వందనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఈదుమూడి, మట్టిగుంట గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన కార్యక్రమాలలో ఎంపీపీ పాల్గొని వీరుల త్యాగాలకు గుర్తుగా ఏర్పాటు చేసిన స్థూపాలకు హారతిచ్చారు. అనంతరం జాతి సమైక్యత కోసం అందరం పాటుపడాలని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. మట్టిగుంటలో రిటైర్డు జవాన్ గోరంట్ల శ్రీనివాసరావును సత్కరించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో లిడ్ క్యాప్ స్టేట్ డైరెక్టర్ కంచర్ల సుధాకర్, ఎంపీడీవో జయమణి, సర్పంచ్‌లు బోలే లక్ష్మీవీరాంజనేయులు, పాలేరు అనీలా నాగేశ్వరరావు, ఎంపీటీసీ పొద పవన్, నాయకులు పోలినేని కోటేశ్వరరావు, మద్దిసాని నాగేశ్వరరావు, బాలకృష్ణ, సాంబయ్య, అక్కేసు, ఏపీఎం రవిబాబు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులను అరెస్టు చేయాలి

ఒంగోలు: కొత్తపట్నం మండలం డీడీకాలనీ యానాదుల భూములు ఆక్రమించి మహిళలపై దాడిచేసిన టీడీపీ నాయకులు పాలూరి కృష్ణారెడ్డి, దద్దాల శ్రీనును తక్షణమే అరెస్టు చేయాలని దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు జూలియస్ డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ గ్రంథాలయంలోని దళిత మహాసభ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే నంబర్లు 2156, 2157లో యానాదులకు ప్రభుత్వం భూములిచ్చిందన్నారు. వాటిలో పంటను ధ్వంసం చేసి దున్ని, హద్దురాళ్లు పీకేసి యానాదులకు చెందిన బోర్లు, మోటారు పైపులు తీసుకెళ్లారని తెలిపారు. దీనిపై కొత్తపట్నం పోలీసుస్టేషన్‌లో 52/2022 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసినా ఇంతవరకు నిందితులను అరెస్టు చేయలేదన్నారు. కొత్తపట్నం తహసీల్దారు, వీఆర్వోలు భూములు యానాదులవే అని నిర్ధారించారని, ఆ మేరకు డీఎస్పీ చార్జిషీటు కూడా వేశారని తెలిపారు. అయినా కృష్ణారెడ్డి నకిలీ పత్రాలతో విద్యుత్ బిల్లులను అతని పేరుమీదకు మార్చుకున్నారని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా కరెంటు కనెక్షన్ యానాదుల పేరుమీదకు మార్పించారని తెలిపారు. బోర్లు, మోటార్లు రికవరీ చేసి ఇప్పించాలని డీఎస్పీని కలెక్టర్ ఆదేశించారన్నారు. అంతేగాకుండా తాజాగా ఆ భూములలో మొక్కలు నాటడంతో దానిపై కొత్తపట్నం పోలీసుస్టేషన్‌లో 92/2023 కింద కేసు నమోదు చేశారన్నారు. దిశ డీఎస్పీ విచారణ చేసి వారమైనా ఇంతవరకు నిందితులను అరెస్టు చేయకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కారుగుంట్ల వెంకటేశ్వర్లు, దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు బత్తుల రమణయ్య, యానాది మహానాడు జిల్లా అధ్యక్షుడు తలపల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

20న నాగభైరవ పురస్కారాల ప్రదానం

ఒంగోలు మెట్రో: డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు పేరు మీద ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు నాగభైరవ సాహిత్యపీఠం పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ తెలిపారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న), ఈదర హరిబాబు, డాక్టర్ నూనె అంకమ్మరావు, డాక్టర్ జక్కంపూడి సీతారామారావు, తేళ్ల అరుణ పాల్గొంటారని, ఒంగోలులోని కవులు, రచయితలు, కళాకారులు హాజరుకావాలని కోరారు.

జగనన్న లే అవుట్లతో కొత్త ఊర్లు



కార్యక్రమంలో మాట్లాడుతున్న రవీంద్రరెడ్డి

ఈతముక్కల (కొత్తపట్నం): జగనన్న లే అవుట్లలో నిర్మిస్తున్న గృహాలు, వాటికి కల్పిస్తున్న సకల సౌకర్యాలతో కొత్త ఊర్లు ఏర్పడుతున్నాయని జిల్లా అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి అన్నారు. ఈతముక్కల గ్రామంలోని జగనన్న లే అవుట్‌లో శుక్రవారం గృహాల లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలో రోడ్లు, నీరు, విద్యుత్, తదితర సౌకర్యాలన్నీ ముందుగానే కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు వేగవంతంగా గృహాలు నిర్మించుకుని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 144 లే అవుట్లలో ఇప్పటికే సగం ఇళ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. మిగతా వారు కూడా పూర్తి చేయాలని కోరారు. సెప్టెంబర్ 15 నాటికి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని వారి పట్టాలు రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం జగనన్న లే అవుట్లను పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ వెంకటనారాయణరెడ్డి, ఏఈ అన్నం నాంచార్లరెడ్డి, మండల ప్రత్యేక అధికారి అర్చన, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, తదితరులు పాల్గొన్నారు.

మహిళలను లక్షాధికారులను చేసేందుకే పాలవెల్లువ

ఈతముక్కల (కొత్తపట్నం): మహిళల జీవనోపాధులు మెరుగుపరిచి వారిని లక్షాధికారులను చేసేందుకే జగనన్న పాలవెల్లువ పథకాన్ని, అమూల్ పాల కేంద్రాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారని జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి కొనియాడారు. జగనన్న పాలవెల్లువ, అమూల్ పాల కేంద్రాలపై మండలంలోని ఈతముక్కల పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమూల్ పాల కేంద్రాలతో పాల ధర లీటర్ రూ.50 నుంచి రూ.88కి పెరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పాడి రైతులు లాభాలతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. మనుషుల ప్రాణాలకే కాకుండా పశువుల ప్రాణాలు రక్షించేందుకు 1,962 అంబులెన్సులను సీఎం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నవరపు రమేష్‌బాబు, మండల ప్రత్యేక అధికారి అర్చన, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, పశువైద్యాధికారిని అనూష, పంచాయతీ కార్యదర్శి కిరణ్, నితిన్, సీసీ రమణ, పాడి రైతులు పాల్గొన్నారు.